భవితకు దిక్సూచి.. జేకేసీ

- ప్రభుత్వ మహిళా కళాశాలలో జవహర్ నాలెడ్జ్ కేంద్రం ఏర్పాటు
- విద్యార్థినులకు ఉపాధి మార్గాలు చూపుతున్న వైనం



జేకేసీ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



క్యాంపస్ డ్రైవ్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థినులు

డాబాగార్డెన్స్: పాత జైల్ రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన జవహర్ నాలెడ్జ్ కేంద్రం(జేకేసీ).. విద్యార్థినుల భవితకు దిక్సూచిగా నిలుస్తోంది. విద్యార్థినుల్లో నైపుణ్యాల వెలికితీత, ఉపాధి కల్పనలో ముఖ్య భూమిక పోషిస్తోంది. కళాశాలలో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ ఉపాధి బాట చూపిస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోంది ఈ జవహర్ నాలెడ్జ్ సెంటర్. ఏటా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో సుమారు 140 నుంచి 150 మంది వరకు ఉద్యోగాలు పొందుతున్నారు.



గ్రూప్ డిస్కసన్‌లో విద్యార్థినులు

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం పొందా..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేశాను. కళాశాలలో ఉన్న జేకేసీ ద్వారా శిక్షణ పొందా. శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో అవగాహన కల్పించడమే గాక మాట్లాడే విధానం, మెలకువలు నేర్పారు. ఫలితంగా జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఇండియన్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్‌కు ఎంపికయ్యా.

– సీహెచ్.రాజ్యలక్ష్మి, కళాశాల పూర్వ విద్యార్థిని

భాషలపై అవగాహన



కళాశాల జేకేసీ ల్యాబ్‌లో కొత్త కొత్త విషయాలు నేర్పిస్తున్నారు. విద్యార్థులకు భాషలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలకు బాటలు వేస్తున్నారు. ఉద్యోగ, ఇంటర్వ్యూల్లో అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేటట్టుగా విద్యార్థులను తయారు చేస్తున్నారు.

– జి.ఎస్.ప్రత్యూష, బీఎస్సీ

ఇంటర్వ్యూలపై శిక్షణ



భాషపై ప్రేమ, ఆప్యాయత పెంచేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఇంటర్వ్యూలపై ప్రత్యేక శిక్షణ ఇస్తూ ఉద్యోగం ఎలా పొందాలి అనే వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

– పి.సాయి ప్రత్యూష, బీఎస్సీ

కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తున్నారు



కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు ఆప్టిట్యూడ్ నేర్పిస్తున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు జేకేసీ ద్వారా తెలుసుకుంటున్నాం. అధ్యాపకులు తమను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు.

– డి.రుచిత, డిగ్రీ విద్యార్థిని

ఎంతో మందికి ఉపాధి అవకాశాలు



ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. జవహర్ నాలెడ్జ్ కేంద్రంలో విద్యార్థుల నైపుణ్యాలు పెంచుతూ, ఉన్నత విద్యావంతులుగా మార్చాం. ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నాం. – డాక్టర్ ఆర్.మంజుల, కళాశాల ప్రిన్సిపాల్

డోంట్ కేర్... పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా..



పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అంటూ కొంత మంది వాహనదారులు నగరంలో చెలరేగిపోతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వాహనాలపై దూసుకుపోతున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారు. ఆ బైక్‌లకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. సోమవారం జీవీఎంసీ ప్రాంతంలో ఓ యువకుడు ఇదే విధంగా బైక్‌పై నంబరు ప్లేట్ లేకుండా... హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ వెళ్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆమె పెదగదిలిలోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ సేవలు

మురళీనగర్: మురళీనగర్‌లోని వార్డు సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ సేవలు ప్రారంభమవుతాయని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు, ఇతర సమస్యలు పరిష్కరించుకోవడానికి ఈ ఏర్పాట్లు చేశామని ఈ నెల 27వ తేదీ వరకు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ లింక్, బయోమెట్రిక్(ఫొటో, ఐరిష్, ఫింగర్ ప్రింట్) అప్‌డేట్, పేరు మార్పు(రుజువు తప్పనిసరి), పుట్టిన తేదీ మార్పు(రుజువు తప్పనిసరి), జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, చిరునామా మార్పు(రుజువు తప్పనిసరి), కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ కార్డు డౌన్‌లోడ్ వంటి సేవలు అందుబాటులో వస్తాయన్నారు. ఇందుకు రూ.50 నుంచి రూ.100 వరకు రుసుము ఉంటుందని చెప్పారు. ఆధార్ క్యాంప్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 10 ఏళ్లకు ఒకసారి ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాల్సి ఉందన్నారు.

క్లుప్తంగా

కబ్జాదారులపై చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం ఎదుట విదసం నాయకులు

మహారాణిపేట : సాంఘిక సంక్షేమ శాఖ భూమి కబ్జాకు కుట్ర పన్నిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి, ప్రభుత్వ ఆస్తిని రక్షించాలని విస్తృత దళిత సంఘాల (విదసం) ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో వెంకటరావు మాట్లాడారు. సిరిపురం టైకూన్ జంక్షన్‌లో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 3500 గజాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ భూమి రక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టి, కబ్జాదారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో విదసం సహాయ కన్వీనర్ సుజాత ఉన్నారు.

కాశీ అన్నపూర్ణ ప్రసాదం పంపిణీ



నారాయణ సేవ ప్రారంభిస్తున్న జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్ : కాశీ పుణ్యక్షేత్రంలోని అన్నపూర్ణ ప్రసాదాన్ని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ నారాయణసేవ ప్రారంభించారు. అనంతరం కాశీ పుణ్యక్షేత్ర ప్రసాదం భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో పైడిరాజు, దానయ్య, అప్పలకొండ, యు.ఎల్లాజీ, టి.కృష్ణ పాల్గొన్నారు.

డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు నేడు

సీతమ్మధార : ద్వారకానగర్ మూడో లైన్‌లోని ఉపాధ్యాయ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ, టెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.అప్పలనాయుడు, సైకాలజీ అధ్యాపకుడు తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాండ్ టెస్ట్ సెమినార్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఫీజు రాయితీ పొందవచ్చని, వివరాలకు 98494 86893 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో 10 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో సోమవారం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాల్లో సోమవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జేకే మీనా, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పలువురు లగేజీలను తనిఖీ చేసే సమయంలో రాజస్థాన్‌కు చెందిన నందకిషోర్, శ్రీరామ్ బిజార్నియాలు అక్రమంగా గంజాయిని తరలించడం గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలని ఆలయ అధికారులు సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి

- పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు గళమెత్తాలి
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ డిమాండ్
- 1257వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షుడు కె.సత్యనారాయణరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1257వ రోజు, సోమవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ఎంపీలందరూ గళం విప్పాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, పూర్తి సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి సాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో విశాఖస్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కూర్చున్నారు. నాయకులు కె.రాజబాబు, మసేనురావు, నరేష్‌కుమార్, డొక్కా నరసింగరావు, జి.జయ, శివరామకృష్ణ, తాండ్ర కనకరాజు, చీకటి శ్రీనివాస్, ఎం.ఎం.ఎల్.నాయుడు, వివిధ యూనియన్ల నాయకులు యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ

'కిల్కారీ'తో తల్లీబిడ్డల ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- కిల్కారీ వాయిస్ కాల్స్‌పై అవగాహన

మహారాణిపేట: తల్లీబిడ్డల ఆరోగ్యానికి కిల్కారీ సేవలు దోహదపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) కార్యాలయంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఆశా, నోడల్ అధికారులకు సోమవారం కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఈ వాయిస్ కాల్స్ సేవలతో తల్లీ శిశు ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేస్తూ కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ వచ్చేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందని డీఎంహెచ్‌వో వివరించారు.



మాట్లాడుతున్న లంకపల్లి రాజు, చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

స్టేట్ ప్రొగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు మాట్లాడుతూ గర్భిణిగా స్థానిక ఏఎన్ఎం దగ్గర వివరాలు నమోదు చేసుకున్న సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. నాలుగు నెలల గర్భిణి నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ఈ కాల్ సమయం సుమారు 1.30 నిమిషాలు ఉంటుందని, ప్రతి గర్భిణి పూర్తిగా వినడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసిన ప్రతి గర్భిణికి 01244451660 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని, ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవీఆర్ సిస్టం ఆటోమేటిక్‌గా ఒకే రోజు 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందని రాజు వివరించారు. తిరిగి ఆ సందేశాన్ని వినాలి అనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చునని చెప్పారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్సుని 11 మాడ్యూల్స్ ద్వారా రూపకల్పన చేశారన్నారు. 14424 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి ఆశా కార్యకర్తలు ఈ కోర్సులో జాయిన్ కావొచ్చునన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రతి గర్భిణికి అవగాహన కల్పించే దిశగా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డాక్టర్ బి.ఉమావతి, కె.ప్రశాంత్, ఆర్.మోహనరావు, కె.ధర్మేంద్ర, ఐ.మనోరమ, శశిభూషణ్, మణికుమారి, నాగభూషణం పాల్గొన్నారు.

రోడ్ల మీదే కార్ల పార్కింగ్

నిత్యం జనాలతో రద్దీగా ఉండే రహదారులు కార్ల పార్కింగ్‌తో నిండిపోతున్నాయి. రోడ్లపై సగానికి పైగా ఆక్రమించి కార్లను నిలిపి షాపింగ్‌లకు వెళ్లిపోతున్నారు. దీంతో ప్రధాన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రధానంగా ఆశీల్‌మెట్ట నుంచి సిరిపురం మధ్యలో, జైలు రోడ్డు నుంచి డాబాగార్డెన్స్, డైమండ్ పార్క్ నుంచి ఫ్లై ఓవర్ రోడ్డులో ఇష్టానుసారంగా కార్ల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది వాహనదారులను వారించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో పోలీసులు సైతం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిని పట్టించుకోవడం లేదు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం











సన్మార్గం వైపు నడిపేది సాహిత్యం

సీతంపేట: సమాజాన్ని సన్మార్గపు జీవనశైలి వైపు తిప్పగల శక్తి సాహిత్యానికి ఉందని పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో దశమ సాహితీ పురస్కారాల సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో రాజులు కవులను, రచయితలను ప్రోత్సహించేవారన్నారు. ప్రస్తుత కాలంలో డాక్టర్ మక్కెన వంటి సాహితీ పోషకులు కవులను, రచయితలను పురస్కారాలతో గౌరవిస్తున్నారని అభినందించారు. విశిష్ట అతిథి వి.రాజారామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆంగ్ల భాష మోజులో పడి తల్లిదండ్రులు తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేనె కంటె తీయనైన తెలుగు భాష పరిరక్షణకు తెలుగు వారందరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మక్కెన శ్రీను పదేళ్లుగా సంస్థ ద్వారా చేపట్టిన సాహిత్య కృషిని వివరించారు. అనంతరం సాహిత్య పురస్కారాలకు ఎంపికైన డాక్టర్ ఎం.సుగుణరావు, లేదాళ్ల రాజేశ్వరరావు, బండారు రాజ్‌కుమార్, కొమ్ముల వెంకట సూర్యనారాయణ, ముని సురేష్‌లను ఘనంగా సత్కరించారు. శిరేల సన్యాసిరావు సభకు అధ్యక్షత వహించగా.. మేడా మస్తాన్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు.



సుగుణరావును సత్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

గోధుమపిండి టెండర్లలో అవకతవకలు

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోధుమ పిండి కోసం దాఖలైన షార్ట్ టెండర్లను సోమవారం రహస్యంగా తీసి, పాత వారికే కట్టబెట్టారని ఏపీ రోలర్ ఫ్లోర్ మిల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ టెండర్లు దాఖలు చేసిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం అమరావతి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో రహస్యం టెండర్లు తెరిచారని, దీని వల్ల తాము ఎంతో నష్టపోయామని అసోసియేషన్ నాయకులు విశాఖలోని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం నాయకులు దృష్టి సారించి, టెండర్ల అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

స్వధర్మాచరణ, సేవతోనే మానవ జన్మ సార్థకత

తాటిచెట్లపాలెం: స్వధర్మాచరణ, నిస్వార్థసేవ, దైవారాధన అనేవి మానవ జన్మ సార్థకతకు దోహదపడతాయని వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో జగద్గురు పీఠం సోదర బృందం సోమవారం నిర్వహించిన మాస్టర్ పార్వతీ కుమార్ సతీమణి కృష్ణకుమారి 74వ జయంతి ఉత్సవ సభలో ఆయన మాట్లాడారు. మాస్టర్ పార్వతీకుమార్ సంకల్పంతో సంస్కృతి సదన్‌ను స్థాపించి, ఇప్పటివరకు 1,802 మంది నిరుద్యోగ మహిళలకు వివిధ వృత్తి విద్యల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడ టైలరింగ్, మెహందీల్లో శిక్షణ పొందిన 49 మంది మహిళలకు ధ్రువపత్రాలను, కొందరికి కుట్టుమిషన్లు అందజేశారు. ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి చంద్రశేఖర గురుప్రసాద్, సంస్థ డైరెక్టర్ ఉషారాణి, ఎం.ఎస్.ఆర్.స్వామి, దాట్ల రాధ, జన శిక్షణ సంస్థాన్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



వివిధ కోర్సులు పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న గురుప్రసాద్, చింతలపాటి సత్యదేవ్

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు ప్రణాళిక

పెందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలో నాణ్యత పెంచే దిశగా నూతన ప్రణాళికను అమలు చేస్తున్నామని ఆర్జేడీ బి.విజయ్‌భాస్కర్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోధన, అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమలో ఉన్న మేధాశక్తిని మరింతగా ఉపయోగించి పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయాలని సూచించారు. బోధన నిరంతర ప్రక్రియ అని..విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చసిన అభ్యసన సామగ్రిని తిలకించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను సందర్శించి ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ న్యాయమూర్తి వెంకటశేషమ్మ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.సువర్ణ, ఎంఈవో-2 మధుమూర్తి, జిల్లా సమగ్ర శిక్ష సహాయ ఏ.ఎం.వో జి.లక్ష్మి, జీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సి.హెచ్ చిన్మయి, టీచ్ టూల్ ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.పూర్ణచంద్ర, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్